సాక్షి అనంతపురం

ఆదివారం । 24 । ఆగస్టు । 2025



చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



టమాట కిలో రూ.34

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.34 పలికింది. కనిష్టం రూ.27, సరాసరి రూ.20 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.7°/21.4°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి తుంపర్లు పడ్డాయి. పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

బలవంతంగా 'కాంప్లెక్స్' అంటగడితే కఠిన చర్యలు



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ వినోద్‌కుమార్

పుట్లూరు: యూరియా కోసం వచ్చే రైతులను కాంప్లెక్స్ ఎరువులనూ తీసుకోమని ఒత్తిడి చేస్తే కఠిన చర్యలు తప్పవని ప్రైవేట్ ఏజెన్సీల నిర్వాహకులను కలెక్టర్ వినోద్‌కుమార్ హెచ్చరించారు.శనివారం ఆయన మండలంలోని కడవకల్లు గ్రామంలో 'స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూరియా సక్రమంగా రైతులకు అందేలా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామన్నారు. 50 శాతం యూరియా ప్రభుత్వ గోదాముల ద్వారా, 50 శాతం ప్రైవేట్ ఏజెన్సీలు పంపిణీ చేస్తాయన్నారు. యూరియాతో పాటు కాంప్లెక్స్ ఎరువులూ తీసుకోవాలంటూ డబ్బు వసూలు చేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయన్నారు. రైతులు ఏవి అడుగుతారో అవి మాత్రమే ఇవ్వాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో పరిశుభ్రత పాటించాలని గ్రామస్తులకు ఆయన సూచించారు. అనంతరం గ్రామంలో 'స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర' ర్యాలీలో పాల్గొన్నారు. పారిశుధ్య కార్మికులకు సన్మానించారు. ఉపాధిహామీ పథకం కింద మంజూరైన వ్యక్తిగత సోక్‌పిట్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని, ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు క్రీడామైదానం కోసం అనువైన స్థలాన్ని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. సచివాలయం వద్ద టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామాంజినేయులు, డీపీఓ నాగరాజునాయుడు, జెడ్పీ సీఈఓ రామసుబ్బయ్య, డ్వామా పీడీ సలీమ్‌బాషా, తహసీల్దార్ శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ హిత విగ్రహాలనే వినియోగించాలి

- జేసీ శివ్‌నారాయణ్ శర్మ పిలుపు



టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ, ఇతర అధికారులు

అనంతపురం: పర్యావరణ హిత విగ్రహాలను వినియోగించాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ మినీ మీటింగ్ హాలులో గణేష్ ఉత్సవ సమితి, సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ పెద్ద విగ్రహాల మంటపాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆధ్యాత్మిక భావం పెంపొందేలా భక్తి పాటలు మాత్రమే వినిపించాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, హానికరమైన రంగుల వినియోగంపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గణేష్ విగ్రహాల నిమజ్జనానికి సంబంధించి హెచ్చెల్సీకి నీరు వదలాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్ఓ ఏ.మలోల, ఆర్డీఓ కేశవ నాయుడు, డీఎస్పీ వి. శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

'ఆంధ్రకేసరి' అడుగుజాడల్లో నడుద్దాం

అనంతపురం: స్వాతంత్ర్య సమరయోధులు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు అడుగుజాడల్లో నడవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ మినీ హాలులో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి నిర్వహించారు.ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ప్రకాశం పంతులు చూపిన తెగువ, ధైర్యం నిరుపమానమన్నారు.

టెన్షన్.. టెన్షన్

- 'మెరిట్' లిస్టు ప్రకటనతో డీఎస్సీ అభ్యర్థుల్లో ఉత్కంఠ
- సెలెక్షన్ జాబితాపై మాత్రం స్పష్టత ఇవ్వని అధికారులు
- ఎంపికైన అభ్యర్థులకు నేరుగా మెసేజ్ వెళ్తుందంటూ ప్రచారం
- ఇదే జరిగితే అక్రమాలకు తావుంటుందంటున్న అభ్యర్థులు
- 25న సర్టిఫికెట్ల పరిశీలనకు ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ



అనంతపురం ఎడ్యుకేషన్: టీచర్ పోస్టులకు సంబంధించిన డీఎస్సీ–25 మెరిట్ జాబితాను విడుదల చేయడంతో అభ్యర్థులకు ఇప్పుడు 'కటాఫ్' టెన్షన్ మొదలైంది. శుక్రవారం రాత్రి 10.30 గంటల సమయంలో పీజీటీ, టీజీటీ మెరిట్ జాబితా విడుదల చేశారు. తర్వాత 11.30 గంటల పైన స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ అభ్యర్థుల మెరిట్ జాబితాలను విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. జాబితాలను ప్రింట్ తీసుకున్న పలువురు అభ్యర్థులు తమకు వచ్చిన మార్కులు, ర్యాంకులపై లెక్కలు వేసుకుంటూ పోస్టు వచ్చే అవకాశాలపై తర్జనభర్జనలు పడుతున్నారు. ప్రధానంగా 'కటాఫ్' ఆయా కేటగిరీల్లో ఎక్కడికి ఆగిపోతుందనే అంశంపై అంచనాలు వేసుకుంటున్నారు. నోటిఫికేషన్, మంజూరు పోస్టులు, ఏ కేటగిరీకి ఎన్ని పోస్టులు కేటాయించారనే జాబితాతో తమకు వచ్చిన ర్యాంకులను పోల్చుకుంటూ కుస్తీ పడుతున్నారు. రిజర్వేషన్లు, లోకల్, నాన్‌లోకల్‌పై లెక్కలు కడుతూ అంచనాలు వేసుకుంటున్నారు. ముఖ్యంగా 'రిజర్వేషన్' అభ్యర్థుల్లో ఏ కేటగిరీలో రోస్టర్ ఎక్కడ మొదలై ఎక్కడ ఆగిపోతుందనే దానిపై ఉత్కంఠ నెలకొంది. సెలెక్షన్ జాబితాపై మాత్రం ఇంకా స్పష్టత రాలేదు. ఆయా పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నేరుగా మెసేజ్‌లు వెళతాయని చెబుతున్నారు. మెరిట్ జాబితా తరహాలోనే సెలెక్షన్ జాబితాలు కూడా ప్రదర్శించాలని అభ్యర్థులు కోరుతున్నారు.

గడువు ఏదీ?

గతంలో మెరిట్ జాబితాలు ప్రకటించిన తర్వాత 15 రోజుల నుంచి మూన్నెళ్ల వరకు గడువు ఇచ్చి సెలెక్షన్ జాబితాలు ప్రకటించేవారని అభ్యర్థులు చెబుతున్నారు. కొన్ని డీఎస్సీల్లో మెరిట్ జాబితాలకు, సెలెక్షన్ జాబితాలకు ఆర్నెల్లకు పైగా గడువు ఉండిందని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడేమో రెండు రోజులు కూడా గడువు ఇవ్వకుండా సర్టిఫికెట్ల పరిశీలనకు సిద్ధం చేస్తుండడాన్ని తప్పుపడుతున్నారు. మెరిట్ జాబితా పరిశీలించి తమకు పోస్టు వచ్చే అవకాశం ఉన్న రిజర్వేషన్ల అభ్యర్థులు కులం, ఆదాయం, స్టడీ తదితర సర్టిఫికెట్లు తెచ్చుకోవాలంటే ఇబ్బందులు ఎదురవుతాయని వాపోతున్నారు.

సర్టిఫికెట్ల పరిశీలనకు సిద్ధం

ఉమ్మడి జిల్లాలో 807 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఈనెల 25న అనంతపురం రూరల్ మండలం ఆలమూరు రోడ్డులోని బాలాజీ పీజీ కళాశాలలో జరగనుంది. జిల్లా పోస్టులతో పాటు జోనల్, రాష్ట్రస్థాయి పోస్టులకు ఎంపికైన జిల్లా అభ్యర్థులు కూడా సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో శనివారం బాలాజీ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన బృందాలకు శిక్షణ ఇచ్చారు. డీఈఓ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ విద్యార్హత, కులం, ఆదాయం, స్థానిక ధ్రువపత్రాలను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు.

నకిలీ సర్టిఫికెట్లు సమర్పిస్తే క్రిమినల్ కేసులు

డీఎస్సీలో భాగంగా ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన వారు నకిలీ సర్టిఫికెట్లు సమర్పిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని డీఈఓ ఎం.ప్రసాద్ బాబు హెచ్చరించారు. సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యే అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. 25న ఆలమూరు రోడ్డులోని బాలాజీ పీజీ కళాశాల ఎంబీఏ బ్లాక్‌లో సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందన్నారు. సమాచారం అందు కున్న అభ్యర్థులు వారికి కేటాయించిన టీంల వద్దకు వెళ్లి సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకోవాలన్నారు. అభ్యర్థులు వారి వ్యక్తిగత లాగిన్ ద్వారా https://apdsc.apcfss.in వెబ్‌సైట్ ద్వారా ఇంటిమేషన్ లెటర్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు 5 పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలన్నారు. అంతకుముందే సర్టిఫికెట్లను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సంబంధిత పత్రాలన్నీ (అటెస్టెడ్ మూడు సెట్లు) ఒక ఫోల్డర్‌లో భద్రపరిచి ఫోల్డర్‌పై హాల్‌టికెట్ నంబరు రాసి అందజేయాలన్నారు.

డీఎస్సీలో అదరహో

అనంతపురం ఎడ్యుకేషన్: పోస్టులు తక్కువ, పోటీ ఎక్కువ. అయినా మొక్కవోని ఆత్మవిశ్వాసంతో రంగంలో దిగారు. ప్రణాళిక ప్రకారం సన్నద్ధమై డీఎస్సీలో సత్తా చాటారు. ఎంత పెద్ద లక్ష్యమైనా, ఎంతమంది పోటీ ఉన్నా కష్టపడి చదివితే అన్నీ అధిగమించి విజేతలుగా నిలవచ్చని నిరూపించారు. వివిధ కేటగిరీ పోస్టుల్లో జిల్లా టాప్ ర్యాంకర్లుగా నిలిచి ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు.

పేరు	సబ్జెక్టు	మార్కులు	ర్యాంకు
టీ.మాధవి	ఎస్‌ఏ (ఇంగ్లిష్)	86.48	1
బండి ఉదయ్‌కుమార్	ఎస్‌ఏ (ఇంగ్లిష్)	85.89	2
అవిలిగొండ సిద్ధార్థ	ఎస్‌ఏ (ఇంగ్లిష్)	84.90	3
గవ్వల బాలచంద్ర	ఎస్‌ఏ (తెలుగు)	84.92810	1
గంధం అశోక్‌కుమార్	ఎస్‌ఏ (తెలుగు)	83.88762	2
ఎన్.ఆదినారాయణ	ఎస్‌ఏ (తెలుగు)	83.87810	3
గొల్లపల్లి పవన్ నారాయణ్ కౌసిక్ శాస్త్రి	ఎస్‌ఏ (హిందీ)	84.03	1
సిద్ధవటం శివలక్ష్మీ	ఎస్‌ఏ (హిందీ)	82.68	2
గుజ్జల అమృతవాణి	ఎస్‌ఏ (హిందీ)	79.52	3
జే.గౌషియా ఖానమ్	ఎస్‌ఏ (ఉర్దూ)	80.67	1
హెచ్.హసీనాబేగం	ఎస్‌ఏ (ఉర్దూ)	79.93	2
పటాన్ సర్దారున్నీసా	ఎస్‌ఏ (ఉర్దూ)	78.37	3
గౌని మధు	ఎస్‌ఏ (బీఎస్)	88.52081	1
వంగలపల్లి దేవరాజు	ఎస్‌ఏ (బీఎస్)	87.32997	2
దేవరపల్లి రాజ్‌కుమార్	ఎస్‌ఏ (బీఎస్)	84.60456	3
తలారి సురేష్	ఎస్‌ఏ (పీఎస్)	87.95	1
కట్టా సురేష్‌బాబు	ఎస్‌ఏ (పీఎస్)	83.25	2
కురుడి వాసుదేవరావు వేదవ్యాస	ఎస్‌ఏ (పీఎస్)	83.23	3
పోరాల మంజుల	ఎస్‌ఏ (గణితం)	87.89529	1
ఈ.చంద్రమౌళి	ఎస్‌ఏ (గణితం)	86.49529	2
పసుపులేటి లక్ష్మీదేవి	ఎస్‌ఏ (గణితం)	84.19498	3
పలమాసి అమరేష్	ఎస్‌ఏ (సోషల్)	88.89893	1
సపారే వెంకటేశులు	ఎస్‌ఏ (సోషల్)	85.58793	2
బులగుండ్ల జ్యోతి	ఎస్‌ఏ (సోషల్)	84.58622	3
భజంత్రి ఉమామహేష్	ఎస్‌ఏ (ఫిజికల్ ఎడ్యుకేషన్)	92.5	1
కలమ్మగారి సురేష్‌బాబు	ఎస్‌ఏ (ఫిజికల్ ఎడ్యుకేషన్)	92	2
ఉడమాల నరేష్	ఎస్‌ఏ (ఫిజికల్ ఎడ్యుకేషన్)	88.5	3
చింతా దివ్యశ్రీ	ఎస్జీటీ తెలుగు	92.79653	1
ఉక్కిసాల సాయికుమార్	ఎస్జీటీ తెలుగు	92.70949	2
గంజి రాశి	ఎస్జీటీ తెలుగు	92.46732	3
పఠాన్ టోపీవలి	ఎస్జీటీ ఉర్దూ	74.97	1
రఫియా ఖానమ్	ఎస్జీటీ ఉర్దూ	74.57	2
నదిమిమజిద్ ఉజ్మా కౌషర్	ఎస్జీటీ ఉర్దూ	74.00	3
నీరుగంటి నాగరాజు	ఎస్జీటీ కన్నడ	73.77	1
కలేకుర్తి యశోద	ఎస్జీటీ కన్నడ	66.73	2
గొల్లరాళ్లి సురేష్	ఎస్జీటీ కన్నడ	66.63	3

కళ్లప్పగించి చూసి.. చివరికి కదిలి!

- గోదాముల్లో ఉత్తుత్తి తనిఖీలు చేస్తున్న 'టాస్క్‌ఫోర్స్'
- శ్రీకాకుళం, ఉత్తరాంధ్ర, కడప, కర్నూలుకు యూరియా సరఫరా
- ఎరువుల కోసం ఇప్పటికీ రోడ్డెక్కుతోన్న అన్నదాతలు



సీజ్ చేసిన యూరియా బస్తాలతో విజిలెన్స్ అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: యూరియా విషయంలో సర్కారు తీరు చూస్తే చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా మారింది. ఖరీఫ్‌లో జిల్లాకు కేటాయింపులే తగ్గించారు. అందులోనూ కోతలు పెట్టారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తన జిల్లాకు ఇబ్బంది రాకుండా శ్రీకాకుళంతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలకు సరఫరా పెంచినట్లు చెబుతున్నారు. అలాగే ఉమ్మడి జిల్లాకు మాత్రమే సరఫరా చేయాల్సిన యూరియా ఈ ఏడాది కర్నూలు, వైఎస్సార్ కడప జిల్లాలకు కొంత కేటాయింపులు చేశారు. అంతో ఇంతో వచ్చినదాంట్లో ప్రైవేట్ హోల్‌సేల్ డిస్ట్రిబ్యూటర్లు, డీలర్లు రైతుల పేరుతో సరిహద్దు ప్రాంతంలో పక్కనున్న కర్ణాటక ప్రాంతానికి తరలించినట్లు తెలిసింది. మార్క్‌ఫెడ్ ద్వారా ఆర్ఎస్‌కేలు, సొసైటీలు, డీసీఎంఎస్‌లకు కేటాయించిన యూరియాను దక్కించుకునేందుకు అధికార పార్టీ నేతలు హడావుడి చేస్తున్నారు. ఇలా... యూరియా చెల్లాచెదురు కావడంతో అన్నదాతకు అవసరానికి అందకుండా పోతోంది. బస్తా... రెండు బస్తాల కోసం కూడా రోడ్డెక్కుతున్న పరిస్థితి ఏర్పడింది. యూరియా నిల్వలు ఖాళీ అయిన తర్వాత సర్కారు పెద్దల ఆదేశాలతో విజిలెన్స్, వ్యవసాయశాఖ, పోలీసు, రెవెన్యూ, సహకార శాఖలతో ఏర్పాటు చేసిన జాయింట్ టాస్క్‌ఫోర్స్ గత రెండు రోజులుగా ఎరువుల గోదాముల్లో ఉత్తుత్తి తనిఖీలతో రైతులను మభ్యపెడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వచ్చింది 14,286 మెట్రిక్ టన్నులు:

ఈ ఖరీఫ్ సీజన్‌లో అన్ని రకాల ఎరువులు 1.07 లక్షల మెట్రిక్ టన్నులు అవసరమని ప్రణాళిక అమలు చేస్తున్నారు. యూరియా 26,839 మెట్రిక్ టన్నులు కేటాయించారు. అందులో ఇప్పటి వరకు 21 వేల మెట్రిక్ టన్నులు రావాల్సి వుండగా 14,286 మెట్రిక్ టన్నులు జిల్లాకు చేరింది. ఒక కంపెనీ నుంచి రావాల్సిన యూరియా ఉత్తరాంధ్ర జిల్లాలకు వెళ్లినట్లు తెలిసింది. అలాగే మరికొంత వైఎస్సార్ కడప, కర్నూలుకు సరఫరా చేయడంతో జిల్లాలో సమస్య ఉత్పన్నమైనట్లు అంచనా వేస్తున్నారు. గత ఖరీఫ్, రబీకి సంబంధించి 15,241 మెట్రిక్ టన్నులు మిగులుబాటు ఉండగా... ఈ ఏడాది దాన్ని కలుపుకుని ఇప్పటి వరకు 26,610 మెట్రిక్ టన్నులు పంపిణీ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం 1,069 మెట్రిక్ టన్నులు బఫర్‌స్టాక్ ఉండగా ఆర్ఎస్‌కేలు, సొసైటీలు, డీసీఎంఎస్‌లు, ప్రైవేట్ డీలర్ల వద్ద 1,671 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్లు పొంతన లేని లెక్కలు చూపుతున్నారు. పరిస్థితి తీవ్రంగా ఉన్నా బఫర్‌స్టాక్ 1,069 మెట్రిక్ టన్నులు బయటకు తీయకపోవడం గమనార్హం. ప్రస్తుతం అందుబాటులో ఉందంటున్న 1,671 మెట్రిక్ టన్నులు ఎక్కడుందనే దానిపై స్పష్టత ఇవ్వడం లేదు. అక్కడక్కడా కృత్రిమ కొరత సృష్టించి బస్తా యూరియా ఎంఆర్‌పీకి మించి రూ.350 నుంచి రూ.400 ప్రకారం అమ్ముతున్నట్లు రైతులు వాపోతున్నారు. యూరియా బస్తా కావాలంటే నానో యూరియాతో పాటు డ్రిప్ మందులు తప్పనిసరిగా తీసుకోవాలని మెలిక పెడుతుండడంతో రైతులపై భారం పడుతోంది.

రైతు సంక్షేమం అంటే ఇదేనా?

ఈ ఖరీఫ్‌లో పంటల సాగు విస్తీర్ణం తగ్గినా యూరియాకు డిమాండ్ రావడం చూస్తే... పెద్ద ఎత్తున పక్కదారి పట్టినట్లు స్పష్టమవుతోంది. ఎరువుల సరఫరా, అమ్మకాలు, మరీ ముఖ్యంగా యూరియా అమ్మకాలపై పర్యవేక్షణ చేయడంలో జిల్లా యంత్రాంగం విఫలమైనట్లు తెలుస్తోంది. తీరా సమస్య ఉత్పన్నమైన తర్వాత హడావుడి చేస్తుండటంపై రైతులు మండిపడుతున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు మంత్రులుగా ఉన్నా రైతు సంక్షేమంపై దృష్టి సారించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2019–24 మధ్య వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు విస్తారంగా వర్షాలు పడటం, లక్షలాది హెక్టార్లలో ఖరీఫ్, రబీ పంటలు, అలాగే ఉద్యాన పంటలు విస్తరించినా... ఎక్కడా ఎరువుల సమస్య అనేది ఉత్పన్నం కాలేదని రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

ఎమ్మెల్యేల కనుసన్నల్లో ఎరువుల మాఫియా

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత ధ్వజం



మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో మద్యం, ఇసుక, ల్యాండ్ మాఫియాతో పాటు ఎరువుల మాఫియానూ చూస్తున్నామంటూ వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. కూటమి ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే మాఫియా నడుస్తోందని దుయ్యబట్టారు. శనివారం ఆయన వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అన్నదాతలను ఆదుకోవాలని ఏడాదిగా తాము ప్రభుత్వానికి విన్నవిస్తున్నామని గుర్తు చేశారు. 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాలోని 8.5 లక్షల ఎకరాల సాగు భూమికి సంబంధించిన ఎరువులను ఎప్పుడో అందించామని చెబుతున్నాయి. కానీ జిల్లాలో ప్రస్తుతం 5.5 లక్షల ఎకరాల్లో మాత్రమే పంటలు సాగయ్యాయి. దీన్ని బట్టి చూస్తే ఇంకా 3 లక్షల ఎకరాల సాగు భూమికి సంబంధించిన ఎరువులు ఏమయ్యాయి' అని ప్రశ్నించారు. ఎల్లో మీడియాలో సైతం ఎరువుల దోపిడీ, బ్లాక్ మార్కెట్ గురించి పుంఖానుపుంఖాలుగా కథనాలు వచ్చాయని, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ప్రజాప్రతినిధులకు తెలిసే అక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

బ్లాక్‌మార్కెట్‌లో ఎరువులు..

జిల్లాలో వేసిన పంటలు కూడా ఇప్పటికే దెబ్బతిన్నాయని, వేరుశనగ 4.5 లక్షల ఎకరాల్లో పంట విస్తీర్ణం ఉండేదని, అలాంటిది నేడు 1,71,000 ఎకరాల్లో మాత్రమే వేసిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో మిర్చి, పత్తి, జొన్న, మొక్కజొన్న తదితర పంటలు వేసుకోవడానికి యూరియా, డీఏపీ అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో ఎరువులను బ్లాక్‌మార్కెట్‌లో కొనాల్సిన దుస్థితి నెలకొందన్నారు. రూ.266.50తో యూరియా బస్తా అమ్మాల్సి ఉంటే రూ.350–రూ.400 వరకూ విక్రయిస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. రూ.1,300 ఉన్న డీఏపీకి రూ.1,600 సమర్పించుకుంటే తప్ప దొరికే పరిస్థితి లేదన్నారు. డీసీఎంఎస్, మార్క్‌ఫెడ్, రైతు సేవా సంస్థలు దోపిడీ కేంద్రాలుగా మారిపోయినా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారన్నారు.

పట్టించుకున్న పాపాన పోలేదు:

సీఎం చంద్రబాబు, ఉమ్మడి జిల్లాలోని మంత్రులు, 14 మంది ఎమ్మెల్యేలు, కలెక్టర్లు రైతులను ఆదుకునే ప్రయత్నం చేసిన పాపాన పోలేదన్నారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తాము ఈ ఏడాది జూలైలో ఓసారి, ఆగస్టు 4న మరోసారి ఐఏబీ, డీఆర్‌సీ సమావేశం ఏర్పాటు చేయాలని విన్నవించినా నిర్లక్ష్యం చేశారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ సీజన్‌కు అనుగుణంగా పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ అందించారని గుర్తు చేశారు. ఇన్సూరెన్స్ ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లించి భారం తగ్గించిందన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులపై ప్రీమియం భారం మోపారని దుయ్యబట్టారు. సౌత్, నార్త్, తాడిపత్రి బ్రాంచ్ కెనాల్‌కు వెంటనే నీరు వదిలే ఏర్పాట్లు చేయాలని, రైతులను ఆదుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో రైతు విభాగం అనంతపురం నియోజకవర్గ అధ్యక్షుడు చిదంబర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులట.. పర్మిట్ రూములట!

- వైన్ షాపుల వద్ద 'పర్మిట్' రూములకు సర్కారు పచ్చజెండా

అనంతపురం: మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూముల ఏర్పాటుకు ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. బహిరంగ మద్యపానం పెరిగి ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. అందుకే ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించడం గమనార్హం. మద్యం ఆదాయంపైనే దృష్టి పెట్టిన కూటమి సర్కార్ ఇప్పటికే ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసింది. ఈ క్రమంలోనే బార్లకు మాత్రమే పరిమితమైన సిట్టింగ్ సదుపాయాన్ని వైన్స్ షాపులకూ విస్తరిస్తూ 'పర్మిట్ రూం' పేరుతో ఏర్పాటు చేసుకునేలా వెసులుబాటు కల్పించింది. ఈ సాకుతో వ్యాపారుల నుంచి భారీగా ఫీజులు వసూలుకు రంగం సిద్ధం చేయడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా 142 వైన్ షాపులు ఉన్నాయి. ఇందులో 104 వైన్ షాపులకు ఏడాదికి రూ.65 లక్షల లైసెన్స్ ఫీజు, తక్కిన 38 వైన్ షాపులకు ఏడాదికి రూ.55 లక్షల చొప్పున నిర్దేశించారు. ప్రస్తుతం రూ.65 లక్షల లైసెన్స్ ఫీజు చెల్లిస్తున్న వైన్ షాపుల వద్ద పర్మిట్ రూము ఏర్పాటుకు రూ. 7.50 లక్షల వార్షిక ఫీజు చెల్లించాలి. రూ.55 లక్షల లైసెన్స్ ఫీజు చెల్లించే వైన్ షాపుల వద్ద ఏర్పాటు చేయనున్న పర్మిట్ రూముకు రూ. 5 లక్షల చొప్పున వార్షిక ఫీజు చెల్లించాలి. ఈ లెక్కన వైన్ షాపుల యాజమాన్యాల నుంచి చంద్రబాబు సర్కారు మరో రూ.9.5 కోట్లు పిండుకోనుంది. అయితే, పరోక్షంగా ఈ భారం ప్రజలపైనే పడనుంది. 'జిల్లాలో మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూముల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. బహిరంగ మద్యపానం పెరిగి ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని భావించి ఈ ఏర్పాట్లు చేస్తోంది' అని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి బి. రామ్మోహన్ రెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

అనంత వాసులకు బళ్లారి రాఘవ పురస్కారాలు




రామగోవిందసాగర్ సాధు శేఖర్

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన సీనియర్ రంగస్థల కళాకారులు రామగోవింద సాగర్, సాధుశేఖర్ కళాప్రపూర్ణ బళ్లారి రాఘవ జాతీయ అవార్డులకు ఎంపికయ్యారు. గత ఐదు దశాబ్దాలుగా కళాకారుల ప్రతిభను గుర్తిస్తూ వారికి గౌరవ సత్కారాలనందిస్తున్న బళ్లారి కల్చరల్ యాక్టివిటీస్ అసోసియేషన్ ప్రతినిధులు 53వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా పలు రాష్ట్రాలకు చెందిన కళాకారులను పురస్కారాలకు ఎంపిక చేశారు. వచ్చేనెల 6న బళ్లారిలో అవార్డుల ప్రదానం జరుగుతుందని నిర్వాహకులు డాక్టర్ బ్రహ్మయ్య తెలిపారు. జాతీయ అవార్డులను అందుకోనున్న రామగోవిందసాగర్, సాధుశేఖర్ రంగస్థలంతో పాటూ ఇంటాక్ (భారతీయ కళలు, వారసత్వ పరిరక్షణ సంస్థ) ద్వారా మన సంస్కృతిని చాటే సేవలందిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారికి లలితకళాపరిషత్తు కార్యదర్శి గాజుల పద్మజ, ఇంటాక్ కన్వీనర్ రాంకుమార్, కార్యవర్గ సభ్యులు అభినందనలు తెలిపారు.

జేఎన్‌టీయూకు ఐఎస్ఓ గుర్తింపు



ఐఎస్ఓ గుర్తింపు పత్రాన్ని వీసీకి అందిస్తున్న దృశ్యం

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంకు ఐఎస్ఓ (ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండరైజేషన్) గుర్తింపు దక్కింది. వర్సిటీలోని అన్ని విభాగాలు, క్యాంపస్ కళాశాల, ఓటీపీఆర్ఐలోని అన్ని విభాగాలను ఐఎస్ఓ బృందం పరిశీలించింది. ఆరు నాణ్యతా ప్రమాణాల సర్టిఫికెట్స్ (ఐఎస్ఓ) రావడం ఎంతో గర్వకారణమని వీసీ హెచ్. సుదర్శనరావు పేర్కొన్నారు. జేఎన్‌టీయూ అనంతపురంకు ఐఎస్ఓ గుర్తింపు రావడం సంతోషకరమన్నారు.

25న సర్టిఫికెట్ల పరిశీలన

అనంతపురం: కానిస్టేబుల్ (సివిల్, ఏపీఎస్పీ) ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 25న ఉదయం 8 గంటలకు జిల్లా పోలీసు కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలని ఎస్పీ పి. జగదీష్ తెలిపారు. జిల్లాలో సివిల్ విభాగం 278 మంది, ఏపీఎస్పీ విభాగం 210 మంది కానిస్టేబుళ్ల ఉద్యోగాలు సాధించారు. అన్ని ధ్రువ పత్రాలు, గెజిటెడ్ అధికారిచే అటెస్టెడ్ చేయించిన మూడు సెట్ల జిరాక్స్ కాపీలను, నాలుగు పాస్‌పోర్టు సైజ్ కలర్ ఫొటోలను వెంట తీసుకరావాలని సూచించారు.

సంపద లేని కేంద్రాలు

గ్రామాల పరిశుభ్రతతో పాటు ప్రజలు కూడా ఆరోగ్యవంతులుగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి చెత్త సంపద కేంద్రాలను నిర్మించింది. చెత్తను వేరు చేసి ఎరువులుగా తయారు చేసి వాటి ద్వారా వచ్చే ఆదాయంతో పంచాయతీలను అభివృద్ధి చేయాల్సి ఉంది. అయితే మహోన్నత ఆశయం కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నీరుగారిపోతోంది.

- దిష్టి బొమ్మల్లా మారిన చెత్త సంపద తయారీ కేంద్రాలు
- స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర ఉత్తిదే !
- గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడే చెత్త దిబ్బలు
- పంచాయతీల ఆదాయానికి గండి



బ్రహ్మసముద్రంలో నిరుపయోగంగా ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్

కళ్యాణదుర్గం: ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. అయితే ఆ ఒక్కరోజు మాత్రమే తూతూ మంత్రంగా కార్యక్రమాన్ని చేపట్టి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. గ్రామాల్లో చెత్త సేకరణ కూడా సక్రమంగా జరగడం లేదు. దీంతో చెత్త సేకరణ కేంద్రాలు కూడా మరుగున పడ్డాయి.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

గ్రామాల్లో ఇంటింటా వ్యర్థాలు సేకరించేందుకు హరిత రాయబారులను నియమించి ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. చెత్త సంపద కేంద్రాలపై జిల్లాస్థాయి అధికారులతో పాటు డివిజన్, మండలస్థాయి అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో రూ.లక్షల వ్యయంతో నిర్మించిన సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. ప్రతి ఊరిలో ఎక్కడ పడితే అక్కడ రహదారుల పక్కన చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్తను ఎక్కడికీ తరలించకుండా చెత్తకు నిప్పు పెట్టి చేతులు దులిపేసుకుంటున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

జిల్లా వ్యాప్తంగా లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారడంతో గ్రామాల్లో మందుబాబులకు ఆవాసాలుగా మారాయి. గ్రామాలకు దూరంగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. కొన్నిచోట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఒక్కో కేంద్రానికి సుమారు రూ.3.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ వెచ్చించి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మాణాలు చేపట్టింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటి నిర్వహణపై చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయా గ్రామాల సర్పంచులు కోరుతున్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పర్యవేక్షించాలని, చెత్త నుంచి ఆదాయం పెంచుకొని ఆ మొత్తాన్ని గ్రామ పంచాయతీల అభివృద్ధికి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గతంలో పక్కాగా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చెత్త సంపద తయారీ కేంద్రాలకు చేరిన వ్యర్థాలను తడి, పొడిగా వేరుచేసి వర్మీకంపోస్టు ఎరువు తయారు చేసేవారు. దీన్ని కిలో రూ.30 నుంచి రూ.40 వరకు రైతులకు విక్రయించి పంచాయతీలకు ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకునేవారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక సంపద కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడి లక్ష్యం నీరుగారిపోయింది. ఇప్పటికైనా రూ.లక్షల వ్యయంతో నిర్మించిన చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకొస్తే పంచాయితీలకు ఉపయోగకరంగా ఉంటుంది.

జిల్లాలో మొత్తం ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు	522
విద్యుత్ కనెక్షన్లు లేనివి	72
నీటి సాకర్యం లేనివి	10
రోడ్లు కనెక్టివిటీ లేనివి	08

వినియోగంలోకి తీసుకురావాలి



చెత్త నుంచి సంపద తయారు చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం షెడ్లను నిర్మించింది. అయితే ఇప్పుడు అవి నిరుపయోగంగా ఉన్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ప్రభుత్వం చొరవ తీసుకుని వీటిని వినియోగంలోకి తీసుకురావాలి. వర్మీకంపోస్టు తయారు చేసి స్థానికంగా ఉండే రైతులకు విక్రయిస్తే పంచాయతీలకు ఆదాయం వస్తుంది.


– ఈరన్న, సర్పంచు, యాటకల్లు



మూలన చేరిన చెత్త సరఫరా చేసే వాహనం

సురవరం మృతి బాధాకరం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత



అనంతపురం కార్పొరేషన్: సీపీఐ అగ్రనేత, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మరణం బాధాకరమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1998, 2004లో సురవరం సుధాకర్‌రెడ్డి ఎంపీగా ఉన్నారని, అదే సమయంలో తాను కూడా అనంతపురం ఎంపీగా ఉన్నట్లు గుర్తు చేసుకున్నారు. సమాజం పట్ల నిబద్ధత, పేద ప్రజలకు మంచి చేయాలన్న తలంపు సురవరం సుధాకర్‌రెడ్డిలో ఉండేదన్నారు. ఆయన మరణం కమ్యూనిస్టు పార్టీలకే కాకుండా బడుగు, బలహీన వర్గాలకు తీరని లోటన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

సురవరం మృతి ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటు

- మాజీ ఎమ్మెల్యే విశ్వ



ఉరవకొండ: కమ్యూనిస్టు యోధుడు, సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మృతి వామపక్ష, ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాకెట్ల అశోక్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. దేశవ్యాప్త విద్యార్థి, యువజన, ఉద్యమాల వ్యాప్తికి సురవరం విశేష కృషి చేశారన్నారు. ఆయన నేతృత్వంలో పనిచేసిన అనేక మంది విద్యార్థి, యువజన నాయకులు తర్వాత కాలంలో వివిధ రాష్ట్రాల్లో రాజకీయ నేతలుగా ఎదిగారన్నారు. సురవరం ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

అనంతపురం: ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో శనివారం హౌసింగ్ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డు అమినిటీ సెక్రటరీలతో కలెక్టర్ సమీక్షించారు. లబ్ధిదారులకు ఇళ్ల బిల్లులు త్వరగా అందుతున్నాయా, లేదా? ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డు అమినిటీ సెక్రటరీలు అందుబాటులో ఉన్నారా, లేదా అనే అంశంపై ఫోన్ కాల్స్ ద్వారా ఫీడ్‌బ్యాక్ తీసుకుంటామన్నారు. లబ్ధిదారులతో అధికారుల ప్రవర్తన సక్రమంగా ఉండాలన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ శైలజ, డీఈ విజయభాస్కర రావు పాల్గొన్నారు.

- జిల్లాలో ఉచిత ఇసుక విధానం సజావుగా అమలు చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. ఈ అంశంపై ఏజెన్సీలు, రవాణాదారులతో ఆయన సమీక్షించారు.

వందశాతం లక్ష్యాలు సాధించాలి

అనంతపురం అగ్రికల్చర్: నిర్దేశిత మార్కెట్ ఫీజుకు సంబంధించి అన్ని మార్కెట్ కమిటీలు వందశాతం వసూళ్లు సాధించాలని మార్కెటింగ్‌శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) సి.రామాంజినేయులు ఆదేశించారు. శనివారం స్థానిక మార్కెటింగ్‌శాఖ కార్యాయలంలో రెండు జిల్లాల ఏడీలు రాఘవేంద్రకుమార్, ఎల్ఎన్ మూర్తితో కలిసి 17 మార్కెట్ కమిటీల సెక్రటరీలు, సూపర్‌వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుత 2025–26 సంవత్సరంలో మార్కెట్‌యార్డుల వారీగా టార్గెట్, ప్రస్తుతానికి సాధించిన ప్రగతిపై సమీక్షించారు. సగం కమిటీల పరిస్థితి మెరుగ్గా ఉండగా సగం కమిటీలు చాలా వెనుకబడ్డాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లా పరిధిలో ఉన్న 9 కమిటీలకు సంబంధించి రూ.13.49 కోట్లు లక్ష్యం కాగా ప్రస్తుతానికి 30 శాతంతో 3.95 కోట్లు సాధించారన్నారు. ఇందులో గుత్తి, రాప్తాడు, గుంతకల్లు కమిటీల పరిస్థితి చాలా నిరాశాజనకంగా ఉందన్నారు.



ఏడీలు, సెక్రటరీలతో సమావేశమైన ఆర్జేడీ రామాంజినేయులు

శ్రీసత్యసాయి జిల్లాలో ఉన్న ఏడు మార్కెట్ కమిటీల టార్గెట్ రూ.5.82 కోట్లు కాగా అక్కడ కూడా 30 శాతం వసూళ్లు సాధించినట్లు తెలిపారు. ధర్మవరం, హిందూపురం, తనకల్లు కమిటీల్లో వసూళ్లు పెరగాలని తెలిపారు. విజిలెన్స్ బృందాలు తరచు క్షేత్రస్థాయిలో పర్యటించి గడువులోపు వంద శాతం లక్ష్యం చేరుకోవడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య




మృతురాలు అమృత రాజమ్మ(ఫైల్)

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని నీలాంపల్లిలో ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నీలాంపల్లిలో గణేష్, అమృత (28) దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి కుమారుడు సంతానం. గణేష్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అయితే శనివారం గణేష్ ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుని అనంతపురంకు వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో అమృత ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందింది. గణేష్ కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బంది పడుతూ ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. కేసు నమోదు చేసుకున్నామని, మృతురాలు ఎందుకు ఉరేసుకుని మృతి చెందిందో విచారణలో తేలాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు.

నార్పలలో మరొకరు..

నార్పల: గత రెండు రోజుల క్రితం మండల పరిధిలోని బొందవాడ గ్రామంలో అదృశ్యమైన మహిళ చెట్టుకు ఉరేసుకొని మృతి చెందిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకెళితే.. బొందలవాడకు చెందిన కాటమయ్య భార్య రాజమ్మ (44)కు మతిస్థిమితం సరిగా లేదు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఫిర్యాదు అందుకున్నా పోలీసులు పరిసర ప్రాంతాలలో గాలింపులు చేపట్టారు. మాలవాండ్లపల్లి గ్రామ శివారుల్లో ఓ చెట్టుకు రాజమ్మ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డీఎస్సీలో మెరిసిన కూలీ బిడ్డ



మౌనిక

ఉరవకొండ: డీఎస్సీ మెరిట్ జాబితాలో కూలీ దంపతుల కుమార్తె జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు కైవసం చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని ఆమిద్యాల గ్రామానికి చెందిన నిరుపేద కూలీలు ఎర్రిస్వామి, లింగమ్మ దంపతుల కుమార్తె మౌనిక డీఎస్సీలో 84 మార్కులు సాధించి జోనల్ స్థాయిలో 6వ ర్యాంకు, జిల్లా స్థాయిలో 2వ ర్యాంకు సాధించి ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ)గా ఎంపికైంది. 1 నుంచి 10వ తరగతి వరకు ఆమిద్యాల జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన మౌనిక ఖోఖోలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో రాణించి ఎన్నో పతకాలు సాధించారు. డీఎస్సీలో ర్యాంకు సాధించిన మౌనికను గ్రామస్తులు అభినందించారు.

కానిస్టేబుల్‌కు టీచర్ ఉద్యోగం



అశోక్

కణేకల్లు: కణేకల్లు వాసి, పోలీసుశాఖలో స్పెషల్ పార్టీ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సి.అశోక్ డీఎస్సీలో జిల్లా స్థాయిలో ర్యాంకు సాధించారు. బీకాం బీపెడ్ (బ్యాచులర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్) చేసిన అశోక్‌కు టీచర్ ఉద్యోగం అంటే చాలా ఇష్టం. 2017లో కానిస్టేబుల్ ఎగ్జామ్‌లో ఉత్తీర్ణత సాధించి కానిస్టేబుల్ అయ్యారు. ప్రస్తుతం ఎస్పీ కార్యాలయంలో స్పెషల్ పార్టీ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 2018లో నిర్వహించిన డీఎస్సీలో ఎగ్జామ్ రాసి క్వాలిఫై కాలేకపోయారు. నిరాశ చెందకుండా డీఎస్సీకి ప్రిపేర్ అయి జిల్లాలోనే 6వ ర్యాంకు సాధించారు. 150 మార్కులకుగాను 86.5 మార్కులు సాధించినట్లు అశోక్ తెలిపారు. అశోక్ టీచర్ ఉద్యోగానికి ఎంపికతో ఆయన తండ్రి హనుమంతప్ప, సోదరుడు సతీష్, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.

ముగిసిన శ్రావణమాస ఉత్సవాలు



ఒంటె వాహనంపై ఊరేగుతున్న ఆంజనేయస్వామి

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఐదు వారాలుగా సాగుతున్న శ్రావణమాసం ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. శ్రావణ మాసం చివరి శనివారం సందర్భంగా నెట్టికంటి ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఒంటె వాహనంపై ఊరేగించారు. స్వామివారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచే భక్తులు ఆలయానికి పోటెత్తారు. ఆలయ ఈఓ ఎం విజయరాజు, ఆలయ అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించండి



బాధితుడు లక్ష్మన్న

రాప్తాడు: మండల కేంద్రానికి చెందిన మాజీ స్టోర్ డీలర్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ జూటూరు లక్ష్మన్న తనకు ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించాలని రాప్తాడు పోలీసుస్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. బాధితుడి వివరాలమేరకు.. ఈ ఏడాది మే 14న పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సీఐ సార్‌ను కలవాలని తనకు ఫోన్ వచ్చిందన్నారు. తాను పోలీసుస్టేషన్ లోపలికి వెళ్తుండగా.. రాప్తాడుకు చెందిన మారుతీ, నారాయణ, జగదీష్‌లు పోలీస్‌స్టేషన్ ముందే తనపై దాడి చేశారన్నారు. ఎందుకు కొడుతున్నారని అడిగినా చెప్పలేదన్నారు. వారిపై కేసు నమోదు చేయాలని అప్పట్లో ఫిర్యాదు చేసినా నేటికీ పోలీసులు స్పందించలేదన్నారు.

నిన్ను కొడితే దిక్కెవరు?

తాజాగా శనివారం సాయంత్రం ఎస్సీ కాలనీలోని తన ఇంటి ముందు కూర్చొని ఉండగా గతంలో దాడి చేసిన నారాయణ మళ్లీ దాడికి యత్నించాడని లక్ష్మన్న ఆవేదన వ్యక్తం చేశారు. బండి ఎక్కు .. నీతో పని ఉందని బూతులు తిట్టారన్నారు. కొడితే దిక్కెవరని, పోలీసులు కూడా మేమంటే భయపడతారన్నారన్నారు. నారాయణ నుంచి తప్పించుకొని, వచ్చి నారాయణ, మారుతీ, జగదీష్‌ల నుంచి తనకు ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించాలని మరోసారి పోలీసులను వేడుకున్నానని లక్ష్మన్న తెలియజేశారు.

అకడమిక్ కన్సల్టెంట్ల భర్తీకి 28న ఇంటర్వ్యూలు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ ఎంబీఏ విభాగంలో అకడమిక్ కన్సల్టెంట్ల భర్తీకి ఈ నెల 28న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ, పీహెచ్‌డీ పూర్తి చేసిన వారు అర్హులని, ఎంబీఏలో కనీసం 55 శాతం మార్కులు సాధించి ఉండాలని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు, రెండు పరిశోధన పత్రాలను తీసుకురావాలని సూచించారు.

అంబులెన్స్‌ను ఢీకొన్న ఆటో

- ముగ్గురికి తీవ్ర గాయాలు

గుత్తి: గుత్తి ఆర్ఎస్ రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. టెంపో ఆటో రివర్స్ చేస్తున్న క్రమంలో అంబులెన్స్‌ను ఢీ కొంది. ప్రమాదంలో అంబులెన్స్‌లో ఉన్న లక్ష్మణ్, మహేష్‌తో పాటు ఆటోలో ఉన్న బాషా అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గాయపడిన వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మహేష్‌ను అనంతపురం తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఎరువుల దుకాణాలపై విజి‘లెన్స్’



పురుగు మందులను పరిశీలిస్తున్న ఏడీఏ అల్తాఫ్‌అలీఖాన్, ఏఓ వెంకటకుమార్

అనంతపురం: అనంతపురం ఉమ్మడి జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ వైబీపీటీఏ ప్రసాద్ ఆదేశాల మేరకు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఎరువుల గోడౌన్లలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. అనంతపురం జిల్లాలో రాప్తాడు మండలం అయ్యవారిపల్లిలోని అవేజ్ లిమిటెడ్ గోడౌన్‌లో 874 మెట్రిక్ టన్నులు, శ్రీ సత్యసాయి జిల్లాకు సంబంధించి 713 మెట్రిక్ టన్నుల నిల్వలను గుర్తించారు. అనంతపురంలోని శ్రీనివాస ఫర్టిలైజర్స్‌లో నిషేధిత గడ్డి మందు అయిన గ్లైఫోసెట్ మందు (రూ.17,560 విలువ.. 22 లీటర్లు) సీజ్ చేసి కోర్టులో కేసు నమోదుకు సిఫార్సు చేశారు. శ్రీ సత్యసాయి జిల్లాలోని హిందూపురంలో శ్రీబాలాజీ ట్రేడర్స్‌లో యూరియా నిల్వ, విలువల్లో తేడాలు గుర్తించారు. బస్తాలను జప్తు చేసి చట్టపరమైన చర్యలకు వ్యవసాయాధికారికి అప్పగించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎం. నాగభూషణం, సీఐ కే. శ్రీనివాసులు, సీఐ జమాల్ బాష, డీసీటీఓ సురేష్ కుమార్, ఎస్ఐ నరేంద్ర భూపతి, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.46.8 లక్షల పురుగు మందులు సీజ్

అనంతపురం అగ్రికల్చర్: రాష్ట్రంలో అమ్మకాలకు అనుమతి లేని క్రిమిసంహారక మందులను అధికారులు సీజ్ చేశారు. యూరియాతో పాటు ఇలాంటి పురుగు మందులు అమ్ముతున్నట్లు వచ్చిన సమాచారం ఆధారంగా శనివారం సాయంత్రం ఏడీఏ అల్తాఫ్‌అలీఖాన్, ఏఓ వెంకటకుమార్‌లు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న సంజీవరాయ ఫర్టిలైజర్స్ దుకాణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 117 బాక్సుల్లో నిల్వ చేసిన రూ.46.8 లక్షలు విలువ చేసే వందలాది లీటర్ల సోలోమాన్ క్రిమిసంహారక మందులను గుర్తించారు. ఈ మందు అమ్మకాలకు రాష్ట్రంలో అనుమతులు లేవని ఏడీఏ తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన పంటల్లో రసం పీల్చు పురుగు నివారణకు వీటిని పిచికారి చేస్తారన్నారు. అనుమతి లేకుండా విక్రయాలు సాగిస్తున్నందున వాటిని సీజ్ చేశామన్నారు.

యాడికిలోనూ..

యాడికి: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణంపై మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా, రెవెన్యూ అధికారులు శనివారం దాడి చేశారు. వెంకట్ ఫర్టిలైజర్ ఎరువుల దుకాణంలో అనుమతిలేని ఎరువులు, పురుగు మందులు గుర్తించారు. రూ.90 లక్షల విలువ గల 48 క్వింటాళ్ల పత్తి విత్తనాలు, రూ.40 లక్షల విలువ గల 550 లీటర్ల పురుగు మందులు సీజ్ చేసినట్లు ఏఓ తెలిపారు.

మహిళను బెదిరించి బంగారం చోరీ

కణేకల్లు: మండలంలోని కణేకల్లు క్రాస్‌లో ఓ ప్రయాణికురాలిని దొంగలు కత్తులతో బెదిరించి బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. పోలీసుల కథనం మేరకు... కణేకల్లుకు చెందిన యశోద అనే మహిళ రెండ్రోజుల క్రితం కర్ణాటకలోని తుమకూరు జిల్లా కునగల్‌లో ఉన్న తన కుమార్తె వద్దకు వెళ్లింది. శనివారం స్వగ్రామానికి బయలుదేరింది. శనివారం సాయంత్రం కళ్యాణదుర్గం–బళ్లారి బస్సు ఎక్కింది. కణేకల్లు క్రాస్‌లో ఈమె బస్సు దిగాల్సి ఉండగా... నలుగురు మహిళలు పక్కా ప్లాన్‌తో వారు కూడా దిగుతున్నట్లు బ్యాగులు సర్దుకొని దిగేలా నటించి బస్టాప్ పోయేలా చేశారు. పెట్రోల్ బంకు సమీపంలో ప్రయాణికురాలు బస్సు ఆపమని చెప్పడంతో ఆమెతో పాటు నలుగురు మహిళలు ఊరి బయట బస్సు దిగారు. ఒంటరిగా ఉన్న యశోదను వారు కత్తులు చూపించి బెదిరించి 11 తులాల బంగారు ఆభరణాలతో ఉడాయించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఏఓ, జూనియర్ అసిస్టెంట్‌పై చర్యలు

అనంతపురం అగ్రికల్చర్: ఏసీబీ కేసులో ఉన్న ఏఓ వెంకటేశ్వరప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ గిరిబాబులకు ప్రభుత్వం ఆర్టికల్ ఆఫ్ చార్జెస్‌ను జారీ చేసింది. ఓ డీలర్ నుంచి డబ్బులు డిమాండ్ చేసిన నేపథ్యంలో 2023 ఆగస్టులో అప్పట్లో రాప్తాడు రెగ్యులర్ ఏఓగా ఉంటూ కూడేరు ఇన్‌చార్జ్ ఏఓగా పనిచేసిన వెంకటేశ్వరప్రసాద్, అనంతపురం ఏడీఏ ఆఫీస్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గిరిబాబులను ఏసీబీ అధికారులు పట్టుకుని, కోర్టుకు హాజరుపరిచారు. కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు పంపారు. జైలు శిక్ష అనంతరం వారికి పోస్టింగ్ ఇచ్చారు. ప్రస్తుతం ఏసీబీ కోర్టులో కేసు నడుస్తోంది. ప్రస్తుతం ఏఓ వెంకటేశ్వరప్రసాద్ శ్రీసత్యసాయి జిల్లాలో, జూనియర్ అసిస్టెంట్ అనంతపురం జిల్లాలో పనిచేస్తున్నారు. ఏసీబీ కేసులో ఉన్న ఏఓ, జూనియర్ అసిస్టెంట్‌లకు ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ జారీ చేశారు. వారు ఇచ్చే వివరణను బట్టి శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

క్లుప్తంగా

రోడ్డు నిబంధనలు పాటించాలి



వాహనాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ లక్ష్మణరావు

ఆత్మకూరు: ప్రమాదాల నివారణకు వాహనదారులందరూ రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలని ఎస్‌ఐ లక్ష్మణరావు సూచించారు. శనివారం ఆత్మకూరు బైపాస్‌లో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక లోడ్, అధిక వేగంతో వెళ్తున్న వాహనాలను నిలిపి జరిమానా విధించారు. వాహనాల ఆర్సీలతో పాటు డ్రైవర్ల లైసెన్స్‌లను పరిశీలించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపరాదని, లైసెన్స్ తప్పక ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాఠకుల సంఖ్య పెరిగేలా చూడాలి



మేడాపురం గ్రంథాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న కార్యదర్శి రమ

చెన్నేకొత్తపల్లి: గ్రంథాలయానికి వచ్చే పాఠకుల సంఖ్యను పెరిగే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమ గ్రామీణ గ్రంథాలయం అధికారి చెన్నకేశవులుకు సూచించారు. శనివారం ఆమె మండల పరిధిలోని మేడాపురం గ్రామంలోని గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రంథాలయం సభ్యత్వాలు, పాఠకుల సంఖ్య ఆరా తీశారు. పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయన్న విషయం యువతకు తెలియజేయాలన్నారు.

27 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన వారితో కళాశాల సిబ్బంది

అనంతపురం రూరల్: నగర శివారులోని పీవీకేకే డిగ్రీ, పీజీ కళాశాలలో సీఎట్ టైర్ల కంపెనీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 27 మంది ఎంపికైనట్లు కళాశాల ప్లేస్‌మెంట్ డీన్ భానుకిరణ్ తెలిపారు. వీరికి వార్షిక వేతనం రూ.3 లక్షలు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ పల్లె వెంకటకృష్ణకిశోర్ రెడ్డి అభ్యర్థులను అభినందించారు. కార్యక్రమంలో సీఎట్ కంపెనీ మేనేజర్లు హరికృష్ణ, రాఘవన్ తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్‌ను వాడొద్దు

- వ్యాపారులకు కమిషనర్ బాలస్వామి హెచ్చరిక

అనంతపురం కార్పొరేషన్: నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడకూడదని వ్యాపారులను కమిషనర్ బాలస్వామి హెచ్చరించారు. శనివారం నగరపాలక సంస్థలో ప్లాస్టిక్ వ్యాపారులతో ఆయన సమావేశమయ్యారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. నిషేధిత ప్లాస్టిక్‌ను విక్రయించరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కలెక్టర్ ఆదేశాలతో శాఖాపరమైన చర్యలకు ఉపక్రమిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే ప్లాస్టిక్‌ను వినియోగించాలన్నారు. సమావేశంలో ఈఈ చంద్రశేఖర్, డీఈలు నరసింహ, సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల నివారణకు కృషి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: మాతా, శిశు మరణాల నివారణకు కృషి చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించి ఎక్కడైనా మరణాలు సంభవించినట్లు నిర్ధారణ అయితే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి హెచ్చరించారు. శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో గత నెలలో జరిగిన 6 శిశు, రెండు మాతృ మరణాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవం జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ డేవిడ్ సెల్వంరాజు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ యుగంధర్, అనస్తీషియా హెచ్‌ఓడీ డాక్టర్ నవీన్‌కుమార్, గైనకాలజిస్టు డాక్టర్ పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఊరిస్తున్న వంద కోట్లు

- నగరపాలక సంస్థ పరిధిలో అనధికార నిర్మాణాలు
- నగరంలో 256 నిర్మాణాలకు చార్జ్‌షీట్లు
- అపరాధ రుసుం రూ.వంద కోట్ల పైమాటే
- వసూలుపై దృష్టి సారించని టౌన్ ప్లానింగ్ అధికారులు



అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలకు ప్రత్యేకంగా బడ్జెట్‌లు పెద్దగా ఉండవని కూటమి ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో ఇంటి, నీటి, అడ్వర్టైజ్‌మెంట్ తదితర పన్ను మొత్తాలతోనే అభివృద్ధి చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇటువంటి తరుణంలో నగరపాలక సంస్థ ఆదాయాన్ని పెంచే పనిలో అధికారులు నిమగ్నమవ్వాల్సి ఉంది. ఈ క్రమంలో అనంతపురం నగరపాలక సంస్థకు టౌన్ ప్లానింగ్ విభాగానికి రావాల్సిన రూ.వంద కోట్లు ఊరిస్తోంది. చార్జ్‌షీట్లు దాఖలు చేసి ఏళ్లు గడిచింది. వాటిపై చర్యలు తీసుకుంటే నగరాభివృద్ధికి మరింత ఆస్కారం ఉంటుందని పలువురు అంటున్నారు.

256 భవనాలకు చార్జ్‌షీట్లు..

నగరపాలక సంస్థలోని టౌన్ ప్లానింగ్ విభాగం అధికారుల బాధ్యతారాహిత్యం నిర్మాణదారులకు వరంగా మారింది. లైసెన్స్ ఇంజినీర్లు ప్లాన్ ఒకలా తీసుకుని నిర్మాణాలు వారికి నచ్చినట్లు ఏర్పాటు చేసుకునేలా చేశారు. కనీసం నిర్మాణాలు జరిగే సమయంలోనైనా టౌన్ ప్లానింగ్ అధికారులు అటు వైపు తొంగి చూశారా.. అంటే అదీ లేదు. తమకేం పట్టదన్నట్లుగా అధికారులు వ్యవహరించారు. నిర్మాణదారులు, లైసెన్స్ ఇంజినీర్లు, అధికారులు, కొందరు పట్టణ ప్రణాళిక కార్యదర్శుల ప్రమేయంతో నగరంలో విచ్చలవిడిగా అనధికార నిర్మాణాలు వెలిశాయి. అనంతపురంలోని కమలానగర్, రామచంద్రనగర్, ఖాజానగర్, వేణుగోపాల్ నగర్, కోవూర్ నగర్, లక్ష్మీనగర్, రామ్‌నగర్, హౌసింగ్ బోర్డు, ఆదర్శనగర్, అరవిందనగర్, సాయినగర్, అశోక్‌నగర్, 1,2,3,4 రోడ్లు, శాంతినగర్, అరుణోదయ కాలనీ, శ్రీనగర్ కాలనీ, మారుతీనగర్ తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అనధికార నిర్మాణాలు చేపట్టారు. అందుకు సంబంధించి వివిధ దశల్లో నగరపాలక సంస్థలో గతంలో పని చేసిన కమిషనర్ల చొరవతో 256 అక్రమ భవనాలకు చార్జ్‌షీట్లు దాఖలయ్యాయి. ప్రతి భవన నిర్మాణదారుడు రూ.లక్షల్లో అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంది.

రూ.వందకోట్ల పైమాటే..

చార్జ్‌షీట్లకు అపరాధ రుసుం వసూలు చేస్తే రూ.వంద కోట్ల పైమాటే ఆదాయం ఉంటుందని నగరపాలక సంస్థ వర్గాలంటున్నాయి. మరి ఆ దిశగా నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

అధికారులు, కార్యదర్శుల కుమ్మక్కు..

నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగానికి ఇన్‌చార్జ్ ఏసీపీ శిరీష, టీపీఎస్‌లు మంజులమ్మ, దుర్గాంజలి, ఐదుగురు పట్టణ ప్రణాళిక కార్యదర్శులు మూల స్తంభాలు. అయితే, వీరి కనుసన్నల్లోనే నగర పరిధిలో ఇష్టానుసారంగా అనధికార నిర్మాణాలు వెలుస్తున్నాయనే ఆరోపణలున్నాయి. కానీ ఎవరూ నియంత్రించలేని పరిస్థితి. రోడ్డు పక్కన ఎక్కడైనా చిన్న టీ బంకు, తోపుడు బండ్లు ఏర్పాటు చేస్తే మాత్రం వీరికి కోపం వచ్చేస్తుంది. కమిషనర్ ఆర్డర్ అంటూ వాలిపోతారు. కళ్ల ముందు అనధికార నిర్మాణాలు జరుగుతున్నా వీరికి పట్టదు. వీరిపై ఏసీబీ అధికారులు నిఘా ఉంచితే అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయని నగరపాలక సంస్థ వర్గాలంటున్నాయి. అదేవిధంగా పట్టణ ప్రణాళిక కార్యదర్శులు సైతం బిల్డర్లుగా మారిపోయారు. వారి పరిధి కాని ప్రాంతాల్లోకి వెళ్లి 'ప్లాన్ గీయిస్తాం, మేమే కట్టిస్తాం' అంటూ బేరసారాలు చేస్తున్నారు. వీరిపైనా కాస్త నిఘా ఉంచితే డొంక కదులుతుందనే చెప్పాలి.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

- ఆర్డీఓ కేశవనాయుడు



ఆడపిల్లల ప్రాముఖ్యత గురించి తెలియజేసే పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ, ఇతర శాఖల సిబ్బంది

అనంతపురం రూరల్: లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని, ఎవరైనా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ కేశవనాయుడు హెచ్చరించారు. శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై డివిజనల్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కేశవనాయుడు మాట్లాడుతూ ఎలాంటి అనుభవం, అర్హత లేని డాక్టర్లు వైద్యం చేయడం వల్ల మరణాలు సంభవిస్తున్నాయన్నారు. ఇలాంటి వారిపై అధికారులు ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఆడపిల్లల ప్రాముఖ్యత, బాల్య వివాహాల వల్ల అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అన్ని శాఖల అధికారులపై ఉందన్నారు. స్కానింగ్ సెంటర్లు, ప్రైవేట్ ఆసుపత్రులపై వైద్య సిబ్బంది ప్రత్యేక నిఘా ఉంచితేనే లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో పోలీసు అధికారి రుషేంద్రబాబు, వైద్యులు దుర్గేష్, రవికుమార్, ప్రతిభాస్రవంతి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి



నిరసన తెలుపుతున్న పీడీఎస్‌ఓ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పీడీఎస్‌ఓ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక క్లాక్ టవర్ సమీపంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నిరసన తెలిపారు. పీడీఎస్‌ఓ జిల్లా కన్వీనర్ అశోక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విశాఖ స్టీల్ ప్లాంట్‌లోని 44 కీలక విభాగాల్లో 32 విభాగాలను ప్రైవేటుకు అప్పగించేందుకు ఒప్పందం చేసుకుందన్నారు. మొత్తం ప్లాంట్‌ను ఒకేసారి అమ్మితే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందనే ఉద్దేశంతో విభాగాల వారీగా ధారాదత్తం చేసే కుట్రకు పూనుకున్నారన్నారు. కేంద్రం ప్రకటించిన రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీని ప్లాంట్‌ను బలోపేతం చేయడానికి ఉపయోగించకుండా.. అప్పులు తీర్చటానికి వినియోగించి, ప్రైవేటీకరణకు సిద్ధం చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, కేంద్ర ఉక్కు సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసరాజు వంటి వారు ఎన్నికల ముందు స్టీల్ ప్లాంట్ రక్షణకు హామీ ఇచ్చినప్పటికీ, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ విధానాలకు మద్దతిస్తూ నిశ్శబ్దంగా ఉన్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ప్లాంట్‌ను కాపాడాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో పీడీఎస్‌ఓ జిల్లా కో-కన్వీనర్ సంజీవ్, జిల్లా కమిటీ సభ్యులు జశ్వంత్, శశి, నగర అధ్యక్షుడు దాదు, సహాయ కార్యదర్శి సాయి విజయ్, సభ్యులు విష్ణు, సంతోష్, చిన్న పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు ఆంధ్రకేసరి



ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



టంగుటూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

అనంతపురం సిటీ: ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అందరికీ ఆదర్శప్రాయులని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ప్రకాశం పంతులు జయంతిని శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పని చేసిన ప్రకాశం పంతులు నిరుపేద కుటుంబంలో పుట్టి, క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకున్నారని గిరిజమ్మ గుర్తు చేశారు. ఆంధ్ర రాజకీయాల్లో ప్రముఖంగా వెలుగొందిన వ్యక్తుల్లో ప్రకాశం పంతులు ఒకరని కొనియాడారు. ఆయన జీవితాన్ని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ ఉద్యోగులు పాల్గొన్నారు.

అనంతపురం కల్చరల్: టంగుటూరి ప్రకాశం పంతులు ఆశయాలను కొనసాగిద్దామని బ్రాహ్మణ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆయన జయంతి సందర్భంగా శనివారం జిల్లా బ్రాహ్మణ సంఘ సమైక్య అధ్యక్షుడు సీవీ మురళీధర్, ప్రధాన కార్యదర్శి రామసుబ్బారావు, సీనియర్ అడ్వొకేట్ రామసుబ్రమణ్యం, శేషశయన తదితరులు స్థానిక రామనగర్‌లోని టంగుటూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సైమన్ కమిషన్ బహిష్కరణ ఉద్యమంలో పాల్గొని తుపాకీ గొట్టానికి గుండె చూపి కాల్చమన్న ధైర్యశాలి టంగుటూరి ప్రకాశం పంతులు అని, ఆయన తెలుగువాడు కావడం గర్వకారణమని వక్తలు కొనియాడారు.

వినాయక ఉత్సవాలకు సహకరించండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న కమిటీ సభ్యులు

అనంతపురం కల్చరల్: నగరంలో ఈనెల 27 నుంచి ఐదురోజుల పాటు సాగే వినాయక చవితి ఉత్సవాలకు అన్ని ప్రభుత్వ శాఖలు సహకారమందించేలా చూడాలని జిల్లా గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. అనంతరం సంస్థ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ విక్రమ్, సీఆర్ విశ్వేశ్వరరెడ్డి, సీనియర్ అడ్వొకేట్ గాజుల పద్మజ తదితరులు మాట్లాడుతూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను తలపెట్టామని వెల్లడించారు. నిమజ్జనం రోజు ఆంక్షల పేరుతో నిర్వాహకులను ఇబ్బంది పెట్టకుండా చూడాలన్నారు. హెచ్చెల్సీలో నిమజ్జన సమయానికి నీరు విడుదలయ్యేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ కుమారయ్య, కోశాధికారి విశ్వనాథరెడ్డి, గోపి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



స్వర్ణాంధ్ర,స్వచ్ఛాంధ్రపై ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



రాప్తాడులో దోమల నివారణకు మందును పిచికారీ చేయిస్తున్న అధికారులు

ఆత్మకూరు: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ అన్నారు. 'స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రామంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ఇంట్లోని చెత్తను రోడ్లపై కాకుండా చెత్తడబ్బాల్లో వేసి ఇంటింటికీ తిరిగే పంచాయతీ వాహనాలతు అందివ్వాలని సూచించారు. అనంతరం వీధుల్లోని చెత్తను సేకరించారు. నీటి ట్యాంకుల పరిసరాలను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ కామాక్షి, మహిళా పోలీస్ అనురాధ, పంచాయతీ కార్యదర్శి సాదిక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాప్తాడు: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఈఓఆర్డీ ఆనంద్ ప్రసాద్ సూచించారు. శనివారం రాప్తాడులో 'స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివాస్'పై ర్యాలీ నిర్వహించి, దోమల నివారణకు మందును పిచికారీ చేయించారు. ముందుగా గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం పంచాయతీ కార్మికులతో వీధులను శుభ్రం చేయించారు. మురుగునీరు ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్, వేస్ట్ ఆయిల్‌ను చల్లించడంతో పాటు చెత్తను తొలగించారు. అనంతరం అధికారులు ఇంటింటికీ తిరుగుతూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈఓఆర్డీ మాట్లాడుతూ.. మురుగు నీరు రోడ్లపైకి వదలకుండా ఇళ్ల ముందు గుంతలు తీసుకుని అందులోకి వదలాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచు సాకే తిరుపాలు, పంచాయతీ కార్యదర్శులు ప్రేమ్‌కుమార్, శమంతకమణి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ సమస్య తీరేదెన్నడు?



గైనిక్, లేబర్ వార్డులకు వెళ్లే మార్గంలో అడ్డదిడ్డంగా నిలిపిన వాహనాలు

ప్రభుత్వ సర్వజనాస్పత్రిని పార్కింగ్ సమస్య వెంటాడుతోంది. పార్కింగ్‌కు శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారులు విఫలమవుతున్నారు. వార్డుల ముందు వాహనాలను ఉంచుతున్నా సెక్యూరిటీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఆస్పత్రి ఆవరణలో వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు నిలుపుతున్నారు. ఆస్పత్రి ప్రవేశ మార్గం నుంచి క్యాజువాలిటీ, గైనిక్ వార్డులకు వెళ్లే ప్రాంతంలో, ఆస్పత్రి చుట్టూ ద్విచక్ర వాహనాలే దర్శనమిస్తున్నాయి. సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ పార్కింగ్ స్థలం ఏర్పాటుపై అధికారులు దృష్టి పెట్టడం లేదు.

– అనంతపురం మెడికల్:

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ



మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: నగరంలోని హెచ్చెల్సీ కాలనీలో నసనకోట ముత్యాలమ్మ ఆలయ 20వ వార్షికోత్సవాల సందర్భంగా శనివారం ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిభావాన్ని నింపుతూ సాగాయి. అమ్మవారికి విశేష అభిషేకాలు, సామూహిక కుంకుమార్చనలు, అలంకార సేవలు వైభవంగా జరిగాయి. మధ్యాహ్నం తీర్థప్రసాద వితరణ, నారాయణ సేవ ఘనంగా జరిగాయి. సాయంత్రం ఆలయ వ్యవస్థాపకులు, కార్పొరేటర్ గురుశేఖర బాబు నేతృత్వంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. పర్యావరణాన్ని కాపాడుకునే విధంగా సహజ పద్ధతుల్లో పండుగను జరుపుకుందామని ఆలయ ప్రతినిధులు, అర్చకులు అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గురు బిందు ప్రియ, శర్మ తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలు వేగవంతం చేయండి

అనంతపురం అగ్రికల్చర్: ఉద్యాన పథకాల అమలు వేగవంతం చేయాలని ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.ఉమాదేవి సిబ్బందిని ఆదేశించారు. శనివారం స్థానిక ఉద్యానశాఖ కార్యాలయంలో హార్టికల్చర్ ఆఫీసర్స్ (హెచ్‌ఓ)తో సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది రూ.12.86 కోట్ల బడ్జెట్‌తో పథక నిర్దేశన చేశారన్నారు. కొత్త తోటల విస్తరణతో పాటు పాతతోటల పునరుద్ధరణ, యాంత్రీకరణ, ఆయిల్‌పాం కింద ఆరు మండలాల్లో 460 హెక్టార్లలో పామాయిల్ తోటల పెంపకం, బాంబ్యూ మిషన్ కింద 9 హెక్టార్లలో వెదురు పెంపకంపై దృష్టి పెట్టాలని తెలిపారు. ఇక ప్రధానంగా పోస్ట్ హార్వెస్టింగ్ మేనేజ్‌మెంట్ కింద రైతులకు అవసరమైన కోల్డ్‌రూంలు, ప్యాక్‌హౌస్‌లు, రైపనింగ్ చాంబర్లు, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు రాయితీలు ఉన్నందున వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అలాగే పనస (జాక్‌ఫ్రూట్)కు సంబంధించి ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటుకు ఎఫ్‌పీఓ ఆసక్తిగా ఉన్నందున డీపీఆర్ సిద్ధం చేయాలన్నారు. ఆర్‌కేవీవై కింద పందిర్లు, ట్రెల్లీస్, ప్లాస్టిక్ క్రేట్స్ అందిస్తామన్నారు.

సలహాలు పాటిస్తే అధిక దిగుబడులు



మాట్లాడుతున్న ఉమామహేశ్వరమ్మ

బుక్కరాయసముద్రం: శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ, రేకులకుంట వ్యసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు సూచించారు. శనివారం మండలంలోని రేకులకుంటలో ఉన్న వ్యవసాయ పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు 60 శాతం విత్తనం వేశారన్నారు. ప్రస్తుతం జిల్లాలో కురుస్తున్న వర్షాలకు చీడ పీడలు తెగుళ్ల సమస్య ఎక్కువయ్యే సమస్య ఉందన్నారు. అలాగే ఎరువుల కొరత ఏర్పడుతోందన్నారు. ప్రత్యామ్నాయంగా సేంద్రియ ఎరువులు వినియోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ పద్మలత, రెడ్డిపల్లి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి, రెడ్డిపల్లి పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ భార్గవి, వాతావరణ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి, కీటక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ జాహ్నవి పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

అనంతపురం: అనంతపురం రూరల్ మండల పరిధిలోని కక్కలపల్లి గ్రామ పంచాయతీ బీజేపీ కొట్టాల సమీపంలో ఇమాముద్దీన్ కుమారుడు షేక్ అస్లామ్ బాష అనే వ్యక్తి అక్రమంగా మద్యం అమ్ముతూ పోలీసులకు పట్టుబడ్డాడు. శనివారం మొత్తం 144 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ జగదీష్ తెలిపారు.


ఇసుక ట్రాక్టర్ సీజ్

పెద్దపప్పూరు: మండలంలోని జూటూరు సమీపంలో ఉన్న పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం పోలీసులు సీజ్ చేశారు. జూటూరు గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని నాగేశ్వర్‌రెడ్డితో పాటు డ్రైవర్‌పై కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

ముగిసిన 'శ్రావణ' పూజలు

అనంతపురం కల్చరల్: శ్రావణ మాస పూజలు శనివారం ముగిశాయి. తెల్లవారుజాము నుంచే నగరంలోని మొదటిరోడ్డు శ్రీకాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం, శారదానగర్‌లోని శ్రీశివబాలయోగి ఆశ్రమం, మారుతీనగర్‌లోని శివాలయం తదితర చోట్ల పెద్దఎత్తున పూజలు నిర్వహించారు. భక్తులు తరలివచ్చి స్వయంగా స్వామివారిని అభిషేకించారు. మహావిష్ణువుకు ప్రీతికరమైన శనివారం రావడంతో అభిషేకాలు, అలంకార సేవలు, సామూహిక కుంకుమార్చనల అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. నగరంలోని శారదా శృంగేరి శంకర మఠంలో సామూహిక ఏడు శనివారాల వ్రతాలను ముగించారు. హెచ్చెల్సీ కాలనీలోని అన్నపూర్ణమంజునాథ ఆలయంలో శ్రావణ అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భాద్రపదం.. పితృదేవతలకు ప్రీతికరం



భాద్రపదంలో పూజలందుకునే వినాయకుడు

అనంతపురం కల్చరల్: సకల శుభాలను, సుముహూర్తాలను తీసుకువచ్చిన శ్రావణ మాసం శనివారం పోలాల అమావాస్యతో ఘనంగా ముగిసింది. సనాతన హైందవ ధర్మంలో ప్రతి మాసానికి ఓ ప్రత్యేకత ఉన్నట్టే ఆదివారం నుంచి ప్రారంభం కానున్న భాద్రపద మాసానికి విశిష్టత ఉంది. ఈ మాసం పితృదేవతారాధనే లక్ష్యంగా మోక్షమార్గం వైపు మళ్లిస్తుంది. వినాయక ప్రీతికర మాసంగా చెప్పుకునే ఈ మాసం వచ్చేనెల 21 వరకు ఉంటుంది. ఇందులో వచ్చే మహాలయ పక్షాల్లో పితృదేవతారాధన ఎక్కువగా జరుగుతుంది. పరమపదించిన పెద్దల శాంతి కోసం అన్నదానం, శ్రాద్ధ కర్మలు నియమనిష్ఠలతో చేసే మాసమిదే. పితృదేవతలు సంతుష్టి చెందితే జీవితం సుఖ సంతోషాలతో ఉంటుందన్నది అందరి విశ్వాసం. మహాలయ పక్షాల్లో విశేషించి శివకేశవ భేదం లేకుండా అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

పండుగలు, వ్రతాలూ..

శుభ కార్యాలు ఈ మాసంలో తక్కువే అయినా పండుగలు, వ్రతాలు భక్తిభావాన్ని మరింత పెంపొందిస్తాయి. ఏ కార్యం తలపెట్టినా విఘ్నాధిపతి అయిన గణపతిని విధిగా తలచే వినాయక చవితి భాద్రపద బహుళ చవితి రోజున అంటే ఈనెల 27న రానుంది. 28న రుషి పంచమి, 21 బుద్ధ జయంతి, 30న రాధాష్టమి, వచ్చేనెల 1న కేదార వ్రతాలు, 17న వామన జయంతి, అనంత పద్మనాభ వ్రతాలతో సాగుతూ 21న సర్వ పితృ అమావాస్యతో భాద్రపదం ముగుస్తుంది. పితృదేవతారాధన కోసం ఈసారి ప్రత్యేకంగా తర్పణాది కార్యక్రమాలను పలు ఆలయాల్లో నిర్వహిస్తున్నారు.

పితృదేవతల ఆరాధనతోనే మోక్షప్రాప్తి

జన్మనిచ్చిన తల్లిదండ్రుల రుణం సాధారణంగా తీరేది కాదు. భాద్రపదం ఆ మార్గాన్ని చూపిస్తుంది. గురువు, దైవంతో సమానమైన పితృదేవతలను పూజించడం వల్ల ఎటువంటి కార్యమైనా సిద్ధిస్తుందని శాస్త్రాలు చెబుతాయి. ఈ మాసంలోని పండుగ రోజుల్లో విరివిగా చేసే అన్నదానాలతో మనోవాంఛలు తీరి పుణ్యలోక ప్రాప్తి లభిస్తుందనేది పెద్దలు చెప్పే మాట. పితృదేవతలను ఎంత ఆరాధిస్తే అందరి జీవితాలు అంత శుభకరంగా ఉంటాయి. దానికి భాద్రపదమే సోపానంగా నిలుస్తుంది.

– నుంకేశుల సత్యనారాయణ, వేదపండితులు, అనంతపురం